క్లుప్తంగా

నేడు అందుబాటులో ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం యర్రగొండపాలెంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు స్థానిక మంజునాథ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఒక శుభ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని, అనంతరం పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మంజునాథ ఫంక్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు


రామాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

పుల్లలచెరువు: ధనుర్మాసం సందర్భంగా మండలంలోని ఉమ్మడివరం గ్రామంలోని రామాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు వేకువ జామునే గ్రామంలో నగర సంకీర్తన చేశారు. భక్తులు విరివిగా పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి, అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి వద్ద దంపతులు కుంకుమార్చన, పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవారిని వారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎస్పీతో మానవతా సంస్థ ప్రతినిధుల భేటీ


ఎస్పీతో మానవతా సంస్థ ప్రతినిధులు

దర్శి: ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, కన్వీనర్, రెడ్‌క్రాస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కపురం శ్రీనివాసరెడ్డిలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. దర్శి ప్రాంత శాంతి భద్రతల గురించి వారు ఎస్పీ దామోదర్‌కు వివరించారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం


అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ శైలేంద్రకుమార్

పెద్దారవీడు: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ శైలేంద్రకుమార్ తెలిపారు. మండలంలోని ఓబులక్కపల్లి రామాలయం వద్ద రెవెన్యూ సదస్సు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఉన్న భూ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని, సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ భూ సమస్యలపై 8 దరఖాస్తులు వచ్చినట్లు వీఆర్వో సంజీవరెడ్డి తెలిపారు. ఆర్ఐ గోపి, మండల సర్వేయర్ రామగోపాలరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసరెడ్డి, స్థానిక రైతులు వెన్నా మల్లారెడ్డి, దుగ్గెంపుడి కొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇక నుంచి రీచార్జి చేస్తేనే కరెంట్

- స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ సిద్ధం
- తొలుత దుకాణాలు, కార్యాలయాలు, ఆ తర్వాత ఇళ్లు
- ఫోన్లు మాదిరిగానే ఎప్పటికప్పుడు రీచార్జి తప్పనిసరి
- సామాన్యుల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వం


ఓ దుకాణాల సముదాయంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లు

పుల్లలచెరువు:

కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పేరుతో పేదల నడ్డి విరిచేందుకు సిద్ధమవుతోంది. మున్ముందు ప్రజల ఇళ్లకు విద్యుత్ సరఫరా కావాలంటే ముందుగానే రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. మొబైల్ ఫోన్లకు ఎలా అయితే రీచార్జి చేసుకుంటున్నామో ఆదే రీతిగా ప్రీపెయిడ్ చెయాల్సిందే. మీరు మొబైల్‌ఫోన్ మాట్లాడుతుండగా ఒక్కోసారి హఠాత్తుగా సిగ్నల్ లేక లేదా రీచార్జి నగదు లేక సర్వీస్ నిలిచి పోతుంటుంది. మళ్లీ ఎవరైనా ఫోన్ చేస్తే మీ ఫోన్ తగినంత బ్యాలెన్స్ లేదని, తిరిగి సేవలు పొందేందుకు రీచార్జి చేసుకోండని వినిపిస్తుంది. రీచార్జి చేయించుకుని సర్వీసును పునరద్ధరించుకుంటాం. త్వరలో ఇళ్లకు కరెంట్ సరఫరా విషయంలోనూ సరిగ్గా ఇదే రీతిగా జరగనుంది. విద్యుత్ శాఖ మాన్యువల్ మీటర్లకు స్వస్తి చెప్పి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తోంది. తొలివిడతగా దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో పలు దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే కేటగిరి-2 మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు అధికారులు బిగించారు. ఈ మీటర్ల ఏర్పాటుపై పేద, మధ్య తరగతి ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం వినియోగదారులు విద్యుత్ వాడకం తర్వాత నెలకు ఒకసారి కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నారు. బిల్లు వచ్చిన 15 రోజుల వరకు అపరాధ రుసుం లేకుండా, 15 రోజుల తర్వాత అపరాధ రుసుంతో బిల్లు చెల్లించేందుకు సమయం ఉంటుంది. స్మార్ట్ మీటర్ల అమర్చిన తర్వాత ఆ వెసులుబాటు ఉండదు. ముందుగానే డబ్బు చెల్లించి రీచార్జి చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఈ విధానం పేద, మధ్య తరగతి ప్రజలకు కాస్త ఇబ్బందిగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 70 వేలకుపైగా వివిధ రకాల విద్యుత్ కనెక్షన్ ఉన్నాయి. ఇప్పటి వరకు 1500 మీటర్ల బిగించామని, దశల వారీగా విద్యుత్ సర్వీసులకు ఈ మీటర్ల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

దశల వారీగా ఏర్పాటు చేస్తాం:
స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారులు నాణ్యమైన విద్యుత్ పొందొచ్చు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. కేటగిరి-2 ఉన్న చోట కూడా వీటిని ఏర్పాటు చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. దశల వారీగా వ్యాపార, అన్ని సర్వీసులకు అధికారుల ఆదేశాలపై స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తాం.
పిల్లి కిషోర్, ఏఈ, పుల్లలచెరువు

ప్రభుత్వం పునరాలోచన చేయాలి:



గ్రామీణ ప్రాంతాల్లో రీచార్జి మీటర్ల ఏర్పాటు అంత మంచిది కాదు. పేద, మధ్య తరగతి ప్రజలు ముందుగానే రీచార్జి చేసుకుని కరెంట్ కొనుగోలు చేసుకోవాలంటే కష్టమే. రీ చార్జి బ్యాలెన్స్ అయిపోగానే గ్రామాల్లోని ప్రజలు ఎక్కడికి వెళ్లి తిరిగి రీచార్జి చేయించుకుంటారు. పట్టణంలో మాదిరిగా అన్నీ అందుబాటులో ఉండవు కదా. పట్టణ ప్రాంతాలకు, వాణిజ్య సముదాయాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు మీటర్ల ఏర్పాటు చేసినా పెద్ద సమస్య ఉండదు. గ్రామీణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి.
జి.గురునాథం, సీపీఐ మండల కన్వీనర్, పుల్లలచెరువు

విద్యాభివృద్ధే లక్ష్యంగా బూచేపల్లి కుటుంబం


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి, వెంకాయమ్మ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ముండ్లమూరు (దర్శి): విద్యాభివృద్ధే లక్ష్యంగా చేసుకుని పేద విద్యార్థులకు 20 ఏళ్లగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తూ వారి ముఖాల్లో ఆనందం చూడటమే బూచేపల్లి కుటుంబ లక్ష్యంగా కొనసాగుతోంది. అందులో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులు 550 మందికి శనివారం స్టడీ మెటీరియల్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి నియోజకవర్గ శాసన సభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదివి అభివృద్ధిలోకి రావడమే తమ కుటుంబం కోరుకుంటోందన్నారు. తన తండ్రి, దివంగత ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి ఆశయాలు నెరవేర్చడమే తమ ముందున్న కర్తవ్యమని, దాన్ని తమ ట్రస్టు ద్వారా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. బూచేపల్లి కుటుంబం ఉన్నంత వరకు నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడంతో పాటు పేద విద్యార్థులకు తమ వంతు సహకారం అందించి వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. అనంతరం విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. జెడ్పీటీసీ తాతపూడి మోజెస్ రత్నంరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూదిదేవర అంజయ్య, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మానందరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మేడికొండ జయంతి, సోమేపల్లి సుబ్బయ్య, మాజీ సర్పంచ్ చింతా శ్రీనివాసరెడ్డి, అంబటి వెంకటేశ్వరరెడ్డి, తాతపూడి దేవయ్య, పాలపోగు డగ్లస్, ప్రధానోపాధ్యాయురాలు ఎల్.మాధవీలత, ఎస్‌కే హజరత్ ఆలీ, ఆర్. శ్రీనివాసరావు, ఎల్.భారతి, కె.చక్రపాణి యాదవ్, కె.శ్రీదేవి, జి. భావన్నారాయణ, కేఎస్ఆర్ కోటేశ్వరరావు, కె.ఏడుకొండలు, కె. సుభాషిణి, ఏ.ఆంజనేయులు, బి.సురేంద్రబాబు, కె.ప్రణతి, కె.శ్రీను, బి. పార్వతి, వి.షణ్ముఖ పాల్గొన్నారు.

బొద్దుకూరపాడులో కూడా..
తాళ్లూరు: మండలంలోని బొద్దుకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు శనివారం ఆల్ ఇన్ ఒన్ స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన వైఎస్సార్ సీపీ నాయకులు పులి కృష్ణారెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు కె.బాలకోటయ్య, సర్పంచ్ మందా శ్యాంసన్, ఇంద్రసేనారెడ్డి, ఉప సర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, గ్రామ పెద్దలు ఎస్.యేగిరెడ్డి, పులి రామిరెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి

పది విద్యార్థులకు ఆల్ ఇన్ ఒన్ పంపిణీ


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

దొనకొండ: విద్యార్థులు చక్కగా చదువుకుని 10వ తరగతిలో మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలకు ఎదిగి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తెచ్చి పెట్టాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 170 మంది విద్యార్థులకు శనివారం బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆల్ ఇన్ ఒన్ పంపిణీ చేశారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. మార్చి నెలలో జరిగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతి ఒక్కరూ సంపూర్ణంగా స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ ట్రస్ట్ ద్వారా దర్శి, చీమకుర్తి, అద్దంకి ప్రాంతాల్లోని పాఠశాలలకు మెటీరియల్ అందజేస్తున్నామన్నారు. పాఠశాలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ విద్యార్థులు కూర్చోవడానికి రూ.15 లక్షల జెడ్పీ నిధులతో బండ పరుపు వేయించారు. అదే విధంగా డైనింగ్ హాల్ ఏర్పాటుకు సహకరించాలని ప్రధానోపాధ్యాయులు వీవీ రామాంజనేయులు వారిని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి డైనింగ్ హాల్ ఏర్పాటుకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించి రాష్ట్ర, జాతీయ స్థాయి పథకాలకు విద్యార్థులను తీసుకెళ్లేందుకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నరసింహారావును బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అభినందించారు. ఎంఈఓలు ఎస్.సాంబశివరావు, షేక్ అమీర్‌బాషా, ఎంపీపీ బొరిగొర్ల ఉష, మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, నూనె వెంకటరెడ్డి, కాలూరి రమణయ్య, బత్తుల వెంకట సుబ్బయ్య, పత్తికొండ వెంకట సుబ్బయ్య, పాతకోట కోటిరెడ్డి, సైరాభాను, గొంగటి పోలిరెడ్డి, వినుకొండ ఇశ్రాయేలు, వినుకొండ కొండలు, విపర్ల సుబ్బయ్య, వెన్నపూస చెంచిరెడ్డి, తమ్మినేని సుబ్బారెడ్డి, సయ్యద్ ముజాయిద్, పులిమి శివ, కె.ప్రసాద్, షేక్ రసూల్, సయ్యద్ అమీర్, సనావుల్లా, రహమత్, కసిబిసి నాగరాజు, బుజ్జి, పాతకోట ఆదినారాయణరెడ్డి, ముడమంచు చిన్న మునలయ్య, చింతగుంట్ల నాగార్జున, అచ్చయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభలు జయప్రదం చేయాలి


ఏఐఎస్ఎఫ్ మహాసభల కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

దర్శి: అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర 22వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.కరుణానిధి, పి. ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి నెల 6,7,8,9 తేదీల్లో శ్రీకాకుళంలో జరుగుతాయని, వాటికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. మహాసభల కరపత్రాలను శనివారం గుజ్జుల సరళాదేవి భవన్ సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకవర్గ విధానాలతో దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందన్నారు. యువతకు ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. దేశంలో రోజూ 40-45 నిరుద్యోగ ఆత్మహత్యలు జరుగుతున్నాయని నేషనల్ క్రైమ్ రిపోర్టులు చెబుతున్నాయన్నారు. విద్య, వైద్యం, ఉపాధి ప్రాథమిక హక్కుగా రాజ్యాంగంలో గుర్తించినా వాటిని వ్యాపారమయం చేస్తున్నారని, యువతకు ఉపాధి అవకాశాలు లేవని తీవ్రంగా మండిపడ్డారు. 22వ రాష్ట్ర మహాసభల సందర్భంగా సమగ్ర యువజన విధానం, భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీం, నూతన పరిశ్రమల్లో యువతకు ఉపాధి కల్పించాలని, డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే ఇవ్వాలని, ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన ఎన్నికల హామీ నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్. రామాంజి, స్టాలిన్, ప్రకాష్, యశ్వంత్ పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి


అంధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సంస్థ నిర్వాహకులు

దర్శి: స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ ఎల్.కృష్ణమూర్తి హాజరై బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ చిరస్మరణీయుడని పేర్కొన్నారు. సంఘ సేవకుడు జీవీ రత్నం మాట్లాడుతూ అంధుల మునివేళ్లలో బ్రెయిలీ ఎల్లవేళలా సజీవంగా ఉంటారని పేర్కొన్నారు. దళిత సంఘ నాయకుడు గర్నెపూడి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో అంధులకు ప్రత్యేక లిపి కనిపెట్టి వారి జ్ఞాన కవాటాలను తెరిచిన మహనీయుడు బ్రెయిలీ అని కొనియాడారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, కన్వీనర్ కె.శ్రీనివాసరెడ్డి, సుశీలమ్మలు విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. రిసోర్స్ ఉపాధ్యాయులు జి.సుబ్రహ్మణ్యం, ఎం.శ్రీనివాసులు, ఆయా బి.లీలావతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ


చిన్న సుబ్బయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దొనకొండ: మండలంలోని భూమనపల్లి సర్పంచ్ విప్పర్ల చిన్న వెంకటేశ్వర్లు కుమారుడు చిన్న సుబ్బయ్య కొన్ని రోజుల క్రితం నిచ్చెన జారి పడిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సందర్భంగా దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం భూమనపల్లి గ్రామంలోని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. భూమనపల్లి ఎస్సీ కాలనీలో మందా రాజు అనారోగ్యానికి గురయ్యాడు. ఈ సందర్భంగా వారి ఇంటికి వెళ్లి రాజును పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయంలెమ్మెల్యే అందజేశారు. ఆర్ఎంపీ శ్యామ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బూచేపల్లి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆరవల్లిపాడు గ్రామ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నాయుడు మనవడు గోపాలకృష్ణ అనారోగ్యంతో ఉండటంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించి తానున్నాంటూ కుటుంబ సభ్యులకు బూచేపల్లి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, మాజీ సర్పంచ్ విప్పర్ల చిన్న మల్లయ్య, మాజీ సర్పంచ్ వీరపనేని చెన్నయ్య పాల్గొన్నారు.

శనగలో పచ్చపురుగు నివారణ చర్యలు చేపట్టాలి


శనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ, రైతులు

ముండ్లమూరు (దర్శి): శనగ పంటలో పచ్చ పురుగు ఆశిస్తోందని, దాని నివారణ చర్యలు చేపట్టాలని ఏఓ తెలిపారు. మండలంలోని ఉల్లగల్లులో శనివారం పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం శనగ పంట శాఖీయదశ నుంచి పూత వచ్చే దశలో ఉందని, శనగ పంటకు పచ్చ పురుగు ఉధృతిని గమనించినట్లు పేర్కొన్నారు. దాని నివారణకు ఫ్లూబెండమైడ్ 40 మిలీ లేదా ఇమామెక్టిన్ బెంజాయేట్ 80 మిలీ ఒక ఎకరానికి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

అగ్రహారం బయల్దేరిన రామదండు


ముస్తాబైన స్వామి వార్లు

కురిచేడు: స్థానిక శ్రీకోదండరామాలయం నుంచి రామదండు శనివారం రాత్రి బయల్దేరి మండలంలోని ఎన్ఎస్‌పీ అగ్రహారం గ్రామానికి చేరింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఎదురేగి రామదండుకు గ్రామోత్సవం నిర్వహించారు.

7 నుంచి ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ

దర్శి: ఈ ఏడాది అమలు చేయనున్న విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ఈ నెల 7, 8, 10వ తేదీల్లో ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి వ్యక్తిగతంగా, వీడియో కాన్ఫరెన్సు ద్వారా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు దర్శి డివిజన్ ఈఈ పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పంపిణీ సంస్థలు ఏపీఈఆర్సీకి సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికపై విజయవాడ బృందావనం కాలనీలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో, 10న కర్నూలు ఏపీఈఆర్సీ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి 1 గంట వరకు వ్యక్తిగతంగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్సు ద్వారా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వినియోగదారులు తమ అభ్యంతరాలు, అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు. వినియోగదారులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఏపీఈఆర్సీ చైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్, సభ్యులు, ఇంధన శాఖ, ఏపీట్రాన్స్‌కో, జెన్‌కో, సీపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్, ఈపీడీసీఎల్ అధికారులు పాల్గొంటారని ఆయన వివరించారు.

సచివాలయ ఉద్యోగుల ధర్నా


ధర్నాకు దిగిన తాళ్లూరు సచివాలయం సిబ్బంది

తాళ్లూరు: పాయకరావుపేట మండలం సత్యవరం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ విజయరాజుపై తహసీల్దార్ సత్యనారాయణ ప్రవర్తించిన తీరును నిరసిస్తూ స్థానిక సచివాలయ సిబ్బంది తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది మాట్లాడుతూ విజయరాజుపై ఎమ్మార్వో సత్యనారాయణ ప్రవర్తించిన తీరు బాధాకరమన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి

- ఎంపీ వైవీ సుబ్బారెడ్డి సూచన

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని వైవీ నివాసంలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్, ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మేడా భద్రీనాథ్‌లు వైవీ సుబ్బారెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉండాలని వైవీ తమకు సూచించినట్లు వారు చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం


తల్లులకు అవగాహన కల్పిస్తున్న మార్తమ్మ

యర్రగొండపాలెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందిస్తున్నారని, వాటిని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్త పూజల మార్తమ్మ కోరారు. మండలంలోని కొత్త గోళ్లవిడిపి గ్రామంలో ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తల్లులకు అవగాహన కల్పించారు. తమ కేంద్రాల్లో చిన్నారులకు చక్కని విద్యను బోధిస్తామని, రెండున్నర నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఏఎన్ఎం పుల్లమ్మ, ఆయా నాగేశ్వరి, ఆశా కార్యకర్త శారమ్మ పాల్గొన్నారు.